
క్లుప్తంగా

కార్గో జిల్లా అధికారిగా సురేంద్రబాబు



తిరుపతి అర్బన్: ఆర్టీసీ తిరుపతి జిల్లా కార్గో అధికారిగా సురేంద్ర బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రకాశం జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న జీఎల్‌పీవీ సుబ్బారావు పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆర్టీసీ కార్గో అధికారులు శనివారం జీఎల్‌వీపీ సుబ్బారావుకు వీడ్కోలు పలుకుతూ సురేంద్రబాబుకు స్వాగతం పలికారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేద్దాం

తిరుపతి కల్చరల్: పుంగనూరులోని ఆర్‌ఆర్ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, క్రిస్టియన్, మైనారిటీల ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలని సభ ఆహ్వాన కమిటీ చైర్మన్ కల్లూరి నాగరాజు గౌడ్ పిలుపునిచ్చారు. ఆయన శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ సభలో దళితులు, గిరిజనులు, బహుజనులు, క్రిస్టియన్, మైనారిటీ సమస్యలు పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

తిరుపతి రైల్వే స్టేషన్‌లో కిక్కిరిసిన ప్రయాణికులు

తిరుపతి అర్బన్: వేసవి సెలవులతోపాటు వారంతం కావడంతో తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఈ క్రమంలో శనివారం తిరుపతి రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడింది. రోజుకు 50 వేల నుంచి 52 వేల మంది ప్రయాణికులు వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

పురోహిత సేవా సంఘం నూతన కమిటీ ఎంపిక

తిరుపతి కల్చరల్: కపిలతీర్థం పురోహిత సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్టు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణమూర్తి, తిరుపతి బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు సంస్కార్ రాజేష్ తెలిపారు. దేవేంద్ర థియేటర్ వద్దనున్న శివాలయంలో శనివారం కపిలతీర్థం పురోహిత సేవా సంఘం సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా అన్నదాన అనిల్‌కుమార్, కార్యదర్శిగా విజయ్‌కుమార్, కోశాధికారిగా దైవస మురళీధర్ నియమితులయ్యారు. అధ్యక్షుడు అన్నదాన అనిల్‌కుమార్ మాట్లాడుతూ సంఘం సభ్యుల సంక్షేమంతో పాటు సంఘం బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

4,577 మందికి జగనన్న విద్యాకానుక

చంద్రగిరి(తిరుపతి రూరల్): పాఠశాల ప్రారంభమైన మొదటిరోజే ప్రతి విద్యార్థికీ జగనన్న విద్యాకానుకను అందించనున్నట్లు చంద్రగిరి ఎంఈఓ లలితకుమారి తెలిపారు. ఆమె శనివారం చంద్రగిరి ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యాకానుకలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సోమవారం పండగ వాతావరణంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. చంద్రగిరి మండలంలో 54 ప్రాథమిక, రెండు యూపీ, 9 జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నట్టు తెలిపారు. వీటిలో 4,577 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి విద్యాకానుక కింద యూనిఫామ్, టెక్స్ బుక్స్, నోట్ బుక్స్, బ్యాగు, షూలు, సాక్స్‌లు అందజేస్తామన్నారు. సోమవారం విద్యా కానుక పంపిణీ చేసి రెండు మూడురోజుల నుంచి యూని ఫామ్‌తో విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

రొంపిచెర్ల: మండలంలోని దండపాణి మామిడి తోట వద్ద ఆదివారం ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందారు. మదనపల్లె డిపో ఆర్టీసీ బస్సు తిరుపతి నుంచి మదనపల్లెకు వెళుతోంది. దండపాణి మామిడి తోట వద్ద కలికిరి నుంచి తిరుపతి వైపు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న తిరుపతి బైరాగిపట్టెడకు చెందిన చైతన్య కుమార్ రెడ్డి (37) తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అన్నమయ్య జిల్లా పీలేరు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. రొంపిచెర్ల పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన

- సచివాలయాలతో సత్వర సేవలు
- ఇంటి వద్దే 548 సేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లోని

సచివాలయాలు	:	102
సెక్రటరీలు	:	849 మంది
డివిజన్లు	:	50
జనాభా	:	4.2 లక్షలు
వార్డు వలంటీర్లు	:	2,010 మంది



సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ చేస్తున్న సెక్రటరీలు(ఫైల్)

తిరుపతి తుడా: ప్రజల వద్దకే పాలన.. గ్రామ స్వరాజ్యం సాధిద్దాం అని రాజకీయ నాయకుల ఎన్నికల సందర్భంగా ఊకదంపుడు ఉపన్యాసాలు దంచుతూ ఉంటారు. మాటల్లో కాకుండా చేతల్లో చేసి చూపించిన నాయకుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి. ప్రతి 2000 ఇళ్లకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి ప్రజల ఇంటి వద్దే ప్రభుత్వ సేవలను తీసుకువచ్చారు. ఆయా శాఖలకు సంబంధించి 10 మంది సెక్రటరీలను నియమించారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి సచివాలయానికి అనుసంధానం చేశారు. వారి ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేశారు. 2019 అక్టోబర్ 2న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రజలకు అంకితం చేశారు. వీటి ద్వారా 548 ప్రభుత్వ సేవలను అందిస్తున్నారు. ఆస్తి పన్నులు, విద్యుత్ బిల్లులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, మున్సిపల్ సేవలతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన సర్వీసులను సచివాలయాల ద్వారా చేస్తున్నారు.

ప్రతిరోజూ స్పందన

వార్డు సచివాలయాల్లో ప్రతిరోజూ ఉదయం స్పందన ప్రజా వినతుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ పరిష్కారానికి చొరవ తీసుకుంటున్నారు. ఫిర్యాదుతోపాటు పరిష్కరించిన సమస్యలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. సచివాలయ స్థాయిలో పరిష్కరించలేని వాటిని ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళుతున్నారు.

ఇంటి వద్దకే సంక్షేమం

సచివాలయాలు ప్రభుత్వానికి–ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ముంగిటకు చేరుస్తున్నారు. సచివాలయ సిబ్బంది వార్డు వలంటీర్లతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల ఎంపీ, ఆన్‌లైన్ నమోదు, పథకాల అందజేత వరకు బాధ్యతగా విధులు నిర్వహిస్తున్నారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ నష్టపోకుండా పారదర్శకంగా సేవలను, పథకాలను అందిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు.

సేవలు భాగున్నాయి



సచివాలయ సేవలు బాగున్నాయి. వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే సేవలు అందుతున్నాయి. ఆధార్ అప్‌డేట్ సచివాలయంలో నిముషాల వ్యవధిలోనే పూర్తయింది. గతంలో క్యూలో నిలబడి అతికష్టం మీద ఆధార్ తీసుకున్నాను. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. –వసంత, 35వ డివిజన్, తిరుపతి

ఇంటి వద్దకే పథకాలు



ప్రభుత్వ పథకాలు ఇంటి వద్దే అందుతున్నాయి. అమ్మ ఒడి, అందరికీ ఇల్లు పథకాలు అందుకున్నాను. కుల ధృవీకరణ పత్రాలు సచివాలయంలోనే ఇచ్చారు. శానిటేషన్ సేవలు మెరుగుపడ్డాయి. స్థానికంగా ఎదురయ్యే సమస్యలను వార్డు సెక్రటరీలు సకాలంలో పరిష్కరిస్తున్నారు. –కె.గంగాదేవి, స్థానికురాలు

సచివాలయంలో ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్



గతంలో సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు సచివాలయంలో తక్కువ సమయంలోనే ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ పొందాను. నాయకులు, అధికారుల చుట్టూ తిరిగేపని లేకుండా సేవలు అందుతున్నాయి. వలంటీర్లు, సెక్రటరీల పనితీరు బాగుంది. –నాగేశ్వరరాజు, స్థానికుడు

అంకితభావంతో పనిచేస్తున్నాం



దేశంలో ఎక్కడాలేని విధంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి 1.30 లక్షల మందికి శాశ్వత ఉద్యోగాలు ఇచ్చారు. ప్రజలకు సులభంగా సేవలు అందించాలని సంకల్పించారు. జగన్ సార్ నమ్మకాన్ని నిలబెడుతూ ప్రజలకు అంకితభావంతో సేవలందిస్తున్నాం. –విద్యాసాగర్, సచివాలయ సెక్రటరీ



క్రికెట్ జెర్సీని ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీహరి, డాక్టర్ శశిధర్ రెడ్డి

క్రికెట్ జెర్సీ ఆవిష్కరణ

తిరుపతి తుడా: జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి జోనల్స్ క్రికెట్ టోర్నీ జెర్సీని శుక్రవారం తిరుపతిలో డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, రమాదేవి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అధినేత డాక్టర్ డీబీ.శశిధర్ రెడ్డి ఆవిష్కరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ జర్నలిస్టులు నిత్యం పని ఒత్తిడితో ఉంటారని, దాని నుంచి ఉపశమనం పొందేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. జర్నలిస్టులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు రమాదేవి ఆసుపత్రి యాజమాన్యం ముందుకు రావడం అభినందనీయమన్నారు. రమాదేవి ఆసుపత్రి అధినేత డాక్టర్ డీబీ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు తాము ఎప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. క్రికెట్ జర్సీ, ట్రోఫీ కప్పులను అందించే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. తిరుపతి జిల్లా జట్టు టోర్నీలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శివశంకర్, జిల్లా అధ్యక్షుడు, కెప్టెన్ పులిగోరు శ్రీనివాసులు, మేనేజర్ విజయ్ యాదవ్, సతీష్, మనోహర్, శేఖర్, శీను, ఆసుపత్రి సిబ్బంది పార్థసారథి, చక్రి పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి భరోసా

భాకరాపేట: నియోజకవర్గ ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇచ్చేందుకే ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ తెలిపారు. ఆమె శనివారం చిన్నగొట్టిగల్లు మండలం నెల్లుట్లవారిపల్లె పంచాయతీలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఆమె మాట్లాడుతూ చాలామంది ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో రోగాలకు చికిత్స చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాంటి పేదలకు ముందస్తు పరీక్షలు చేయించి వైద్యం అందించడానికే శిబిరాలు ఏర్పాటుచేసినట్టు తెలిపారు. అందరూ ఆరోగ్యంగా ఆనందంగా ఉన్నప్పుడే తమ కుటుంబం సంతోషంగా ఉంటుందన్నారు. నెల్లుట్లవారిపల్లె పంచాయతీలో 1,509 మంది పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి, సర్పంచ్ శశిప్రియ, ఎంపీటీసీ అమరావతి, ఎంపీడీవో దేవేంద్ర బాబు, ఈవోపీఆర్డీ మదనమోహనరాజు, వైద్యులు శశికళ, అలెగ్జాండర్ పాల్గొన్నారు.



నెల్లుట్లవారిపల్లె వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న చెవిరెడ్డి లక్ష్మీ



ఘనంగా జన్మదిన వేడుకలు

వైఎస్సార్ విద్యార్థి విభాగం రాయలసీమ అధ్యక్షుడు వి.హరిప్రసాద్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆ సంఘం నేతలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎస్వీ యూనివర్సిటీలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అలాగే రుయా ఆస్పత్రి వద్ద నిరుపేదలకు అన్నదానం చేశారు. విద్యార్థి విభాగం నేతలు మార్ల సుధాకర్ రెడ్డి, రుయా ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

జేసీఐ మల్టీట్రేడ్ ఎక్స్‌పో ప్రారంభం



జేసీఐ మల్టీట్రేడ్ ఎక్స్‌పో-2023ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి, పోకల అశోక్ కుమార్

తిరుచానూరు(చంద్రగిరి): జేసీఐ తిరుపతి ఆధ్వర్యంలో జెకామ్ నిర్వహిస్తున్న మల్టీ ట్రేడ్ ఎక్స్‌పో–2023ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్ కుమార్ కోరారు. తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో శనివారం మల్టీ ట్రేడ్ ఎక్స్‌పో–2023ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఈ ఎక్స్‌పో ద్వారా ఒకే వేదికపై కార్లు, బైక్‌ల ప్రదర్శన, రియల్ ఎస్టేట్, బిల్డర్స్, ప్లానర్స్, శానిటరీ, టైల్స్, బంగారం, కంప్యూటర్లు, హాస్పిటల్స్, ఆయుర్వేదిక్, హోమియోపతి, నేచురల్ ఫుడ్స్, హెర్బల్స్ స్టాల్స్, కాస్మోటిక్స్, సేవా సంస్థలు ఇలా అన్ని రకాల వ్యాపార సంస్థల స్టాల్స్ అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. ప్రజలు వీటిని సందర్శించడం ద్వారా అనుమానాలను నివృత్తి చేసుకోవడంతో పాటు పెట్టుబడులు పెట్టడం, కొనుగోలు, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా పొదుపు చేయడంపై అవగాహన కలుగుతుందన్నారు. రెండు రోజుల నిర్వహించే ఈ ఎక్స్‌పోలో పాల్గొనే ప్రజలకు బహుమతులు, ప్రతి రెండు గంటలకు ఒక్కసారి లక్కీడిప్ ద్వారా సిల్వర్ కాయిన్స్ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆదివారం ముగింపు కార్యక్రమంలో బంపర్ ప్రైజ్‌ను అందజేయనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో జేసీఐ జోన్–4 చైర్మన్ మంగేష్, జాతీయ డైరెక్టర్ హర్షవర్ధన్ రెడ్డి, జోన్–4 సీనియర్ మెంబర్ అసోసియేషన్ చైర్మన్ సత్యనారాయణ, జోన్ అధ్యక్షుడు డాక్టర్ సూరి, రాజారెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



డ్రమ్స్ శివమణి, తమన్, రమేష్‌రెడ్డి, సినీ నటి ఐశ్వర్య లక్ష్మీ

తిరుమల: శ్రీవారిని శనివారం కర్ణాటక మంత్రి మునియప్ప, సినీనటి ఐశ్వర్య లక్ష్మి, ఎమ్మెల్యే అన్నా రాంబాబు, ఐపీఎస్ అధికారి మురళీకృష్ణ, మ్యూజిక్ డైరెక్టర్ డ్రమ్స్ శివమణి, తమన్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రమేష్ రెడ్డి దర్శించుకున్నారు. వీరికి అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

కోదండ రామాలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న గోపాలకృష్ణ, పరిమళ

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరిలోని టీటీడీ అనుబంధ కోదండ రామాలయంలో శనివారం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని ఆలయాల డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కోదండ రామాలయానికి భక్తుల సంఖ్య పెరుగుతోందన్నారు. ఈ క్రమంలో ప్రతి శనివారం స్వామివారి భక్తులకు అన్నదానం చేయాలని నిర్ణయించామన్నారు. మొదటిసారి కోదండ రామాలయ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ, పరిమల దంపతులు భక్తులకు అన్నదానం చేసినట్టు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఆలయంలో ప్రతి శనివారం భక్తులకు అన్నదానం చేయడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. అన్నదాన కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా ఏఈఓ పార్థసారథి హాజరయ్యారు. ఏఈఓ సుబ్బరాజు, మాజీ ఎంపీటీసీ కేశవులు, అర్చకులు శ్రావణ్ స్వామి, మోహన్‌స్వామి పాల్గొన్నారు.

జూలై 8న స్కూల్ స్వీపర్స్ రాష్ట్ర మహాసభలు

తిరుపతి కల్చరల్: విజయవాడలో జూలై 8వ తేదీన స్కూల్ స్వీపర్స్ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్టు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ తెలిపారు. బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో శనివారం స్కూల్ స్వీపర్స్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు జీతాలు పెంచాలన్నారు. స్కూల్ స్వీపర్స్‌పై పనిభారం పెరుగుతున్నా రెగ్యులర్‌గా జీతాలు ఇవ్వడం లేదని తెలిపారు. ఈ సమస్యలపై ఈ నెల 19వ తేదీన చిత్తూరు జిల్లా కలెక్టర్‌ను, డీఈవోను కలిసి వినతి పత్రం సమర్పించాలని తీర్మానించినట్టు పేర్కొన్నారు.

సబ్సిడీ రుణాలు మంజూరు చేయండి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సంగా పద్మజారెడ్డి

పాకాల: పాకాల మండలంలో స్వయం ఉపాధిపై ఆధారపడిన వారికి సబ్సిడీ రుణాలు ఇవ్వాలని జెడ్పీటీసీ సంగా పద్మజారెడ్డి కోరారు. చిత్తూరులోని జెడ్పీ సమావేశపు హాలులో శనివారం జెడ్పీ సర్వసభ్య సమాశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఓల్టా సర్టిఫికెట్లు ఆలస్యం కాకుండా ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. పాకాల మండలం ఈ–పాలగుట్టపల్లిలో మహిళలు పర్యావరణాన్ని పరిరక్షించే దిశగా గుడ్డ బ్యాగులు తయారు చేస్తున్నారని పేర్కొన్నారు. వారిని ప్రోత్సహించడానికి సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని విన్నవించారు.

పుస్తకాన్ని నేస్తంగా మార్చుకోండి



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): పిల్లలు విద్యార్థి దశ నుంచే పుస్తకాలను నేస్తంగా మార్చుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ నైనార్ మధుబాల పిలుపునిచ్చారు. చంద్రగిరి ప్రభుత్వ గ్రంథాలయంలో గత నెల 8 నుంచి నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణా శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న ఆధునిక జీవన విధానంలో ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్‌కు అతుక్కుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల విద్యార్థుల్లో మనోవికాసం తగ్గిపోతోందని వాపోయారు. పుస్తకాన్ని చదవడం అలవాటు చేసుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రంథాలయ అధికారి రెడ్డెమ్మ పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణా శిబిరాలు

పాకాల: మండలంలోని దామలచెరువు, పాకాల శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలు ముగిసినట్టు గ్రంథాలయాధికారులు గజేంద్రబాబు, రవీంద్ర తెలిపారు. వారు శనివారం మాట్లాడుతూ పుస్తక పఠనం, వ్యాసరచన పోటీలు, చిత్రలేఖనం, కబడ్డీ, క్యారంబోర్డు, తదితర పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కస్తూరి, విశ్రాంత ఎంఈఓ మునస్వామి, సిబ్బంది మురళీబాబు, దేవీబాల, చంద్ర, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మాడ వీధుల్లో మెటల్ డిటెక్టర్లు



తిరుమల శ్రీవారి ఆలయం అత్యంత భారీ భద్రత ఏర్పాటుచేశారు. ఇందులో భాగంగా నాలుగు మాడ వీధుల్లో మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేశారు. టీటీడీ విజిలెన్స్ సిబ్బంది, పోలీసులు భక్తులను తనిఖీలు చేస్తున్నారు. – తిరుమల

అద్వితీయం.. సహన నృత్యాభినయం



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారి సహన

తిరుపతి కల్చరల్: మహతిలో శనివారం రాత్రి చిన్నారి ప్రిషిత సహన చేసిన భరత నాట్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. తిరుపతికి చెందిన ఎస్పీడీసీఎల్ రిటైర్డ్ ఎస్ఈ సుబ్బన్న మనవరాలు అయిన ప్రిషిత సహన అమెరికాలో ఉంటూ భారతీయ కళలపై ఆసక్తితో భరత నాట్యం అభ్యసించింది. నృత్య ఆరంగేట్రాన్ని మహతి కళాక్షేత్రంలో చేపట్టింది. ఇందులో ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఉమా ముద్దుబాల, మృదంగం విభాగాధిపతి ఎం.సుధాకర్, నృత్యాచార్యుడు పి.రవిసుబ్రమణ్యం ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారి సహన చక్కటి హావభావాలు, ఆహార్యంతో, లయబద్ధంగా నృత్యం చేసి ప్రేక్షకుల మన్ననలు అందుకుంది. తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి సీఈ రెకే.శేషగిరిరావు, ప్రసాద్‌రావు, బుజ్జిబాబు, శాంతావాణి, వీకే.రెసిడెన్సీ అధినేత పి.సూర్యప్రకాష్ తదితరులు చిన్నారిని అభినందించి ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో చిన్నారి సహన తల్లిదండ్రులు శైలజ, విజయకుమార్, గురువు గురు కళశ్రీ ఆషా గోపాల్, రిటైర్డ్ ఎస్ఈ సుబ్బన్న పాల్గొన్నారు.